
# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 26 జనవరి, 2026 | పేజీలు :06


## ధర్మపురి రూపురేఖలు మారుస్తా



మెయిన్‌లో

# 16వ జాతీయ ఓటరు దినోత్సవం

### కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ సమాజంలో ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి సూచిక అని తెలిపారు. భారతదేశంలో ఓటు హక్కు అమలైన తీరును వివరించారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, పిల్లలందరికీ చిన్ననాటి నుంచే ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలపాలన్నారు.సమావేశానికి హాజరైన వారితో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాలలో పాలుపంచుకున్న విద్యార్థులకు, అధికారులకు, క్రమం తప్పకుండా పలు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లను, కలెక్టర్ సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరంతా సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని కలెక్టరేట్, ప్రాంగణంలో జెండాను ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### నృసింహుడి సన్నిధిలో
## మంత్రి అడ్లూరి పూజలు



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి వారిని ఆదివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమి పర్వదిన ప్రత్యేక పూజాది కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆశీర్వచనం మండపంలో ఆలయ పాలక మండలి చైర్మన్ జక్కు రవీందర్, కార్య నిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ లు మంత్రి అడ్లూరిని శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అర్చకులు, వేదపండితులు దైవిక ఆశీస్సులు అందజేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలకై మంత్రికి ఆహ్వానం:** జగిత్యాల జిల్లా బీర్పూర్ లో ఈనెల 28 నుండి 12 రోజులపాటు జరిగే శ్రీ లక్ష్మి నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఆహ్వానిస్తూ ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో బీర్పూర్ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

### సమ్మక్క సారలమ్మ జాతరలో
## పకడ్బందీగా ఏర్పాట్లు

### సమ్మక్కసారలమ్మను దర్శించుకున్న వెలిచాల

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు సూచించారు. 19వ డివిజన్ రేకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బాలబద్రి శోభారాణి శంకర్ ఆహ్వానం మేరకు ఆదవారం రేకుర్తిలోని సమ్మక్క సారలమ్మ జాతర సంధర్భంగా అమ్మవార్లను రాజేందర్‌రావు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సంధర్భంగా రాజేందర్ రావు జాతర ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో, సంబంధిత అధికారులకు ఊచించారు. సమ్మక్క సారలమ్మ దీవెనలు ఆశీస్సులు కరీంనగర్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కరీంనగర్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. రాజేందర్‌రావుకు జాతర కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో 19వ డివిజన్ అధ్యక్షుడు అస్తపురం దీక్షిత్, స్థానిక కాంగ్రెస్ నాయకులు దుర్గం సుధీర్ కుమార్, దుర్గం శేఖర్, 20వ డివిజన్ అధ్యక్షుడు అస్తపురం రమేష, 20వ డివిజన్ ఇంచార్జి అస్తపురం తిరుమల, అక్కపెల్లి మల్లేశం, హస్తపురం కొమురయ్య, చంటి మహేష్, గంగిపల్లి సంపత్, గోనె సురేష్, లింగంపల్లి లక్ష్మయ్య, జాడి అశోక్, హేమంత్, అస్తపురం రాజయ్య, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



# 'అగ్నివీర్'కు ఎంపికైన యువకుడికి సన్మానం



ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామ పంచాయతీ అధికారి కొలిపాక పోచాలు కుమారుడు కొలిపాక విష్ణు ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెకండరీ రిక్రూట్స్ ద్వారా ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విష్ణును అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్ శాలువాతో సత్కరించి అభినందించారు. తహసీల్దారు మాట్లాడుతూ, తన కుమారుడు కూడ ఆర్మీలో ఉన్నత వైద్యాధికారిగా పనిచేస్తున్నారని తెలిపారు. దేశం కోసం, తల్లిదండ్రుల ఆశయాన్ని నిలబెట్టేందుకు నేటి యువత రక్షణ దళాల్లో చేరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దారు మల్యాల తిరుపతి, గిర్దావర్లు శ్రీమాన్, రమేష్, సర్వేయర్ లలితా కుమారి, సీనియర్ సహాయకురాలు త్రివేణి, జూనియర్ సహాయకులు శ్రీనివాస్, ఎపిఎస్‌వో శైలజ, జీపీవోలు సుమలత, వినోద, పుష్పలత, శ్రీనివాస్, రాజ్‌కుమార్, మర్రి శంకర్‌స్వామిలు పాల్గొన్నారు.

## 'పరమేశ్వరన్' సేవలు అభినందనీయం!



ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోయల్‌వాడ సమ్మక్క, సారాలమ్మ జాతర వద్ద ఏర్పాట్లకు సంబంధించి గత నెల రోజులుగా సేవలు అందిస్తున్న సామాజికసేవా కార్యకర్త కంద పరమేశ్వరన్‌ను పలువురు అభినందిస్తున్నారు. ఇక్కడి నది ఒడ్డున వెలిసిన శివుడికి నీడ కల్పించేందుకు తన సొంత ఖర్చుతో పైకప్పు షెడ్ నిర్మాణాన్ని చేపట్టారు. గతంలో కూడ ఉచితంగా శివాలయానికి రెండుమార్లు షెడ్ నిర్మించినట్లు ఆయన తెలిపారు. వరదలకు ఆలయ షెడ్ దెబ్బతినడంతో మరమ్మత్తులు చేసి పునర్నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం ఇక్కడి సమ్మక్క, సారాలమ్మ గద్దెల చుట్టూ, ప్రాంగణం ప్రహరీ చుట్టూ ఇనుప పైపులతో రక్షణ కంచె ఏర్పాటు చేసే పనులకు సంబంధించి ఉచిత సేవలు అందించానన్నారు. పీఈబీ షెడ్స్ అండ్ వెల్డింగ్ వర్క్స్ దుకాణ యాజమానిగా కొనసాగుతున్న కంద పరమేశ్వరన్ గత కొన్నేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడ్తూ అందరి అభిమానాన్ని పొందుతున్నారు. గోయల్‌వాడ సమ్మక్క, సారాలమ్మ జాతర ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్ది భక్తులకు సౌకర్యం కల్పించడం పట్ల జాతర కమిటి నిర్వాహకులు, గోయల్‌వాడ గ్రామ, అంతర్గాం మండల ప్రజలు పరమేశ్వర్‌ను అభినందిస్తున్నారు.

## జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో భాగంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత బలమైన ఆయుధమని, ప్రతి ఓటరు తప్పనిసరిగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, సందీప్‌రెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాపక్షం/మల్లాపూర్ : ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ చిట్యాల లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పదహారవ జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి, అంగన్వాడి టీచర్లు ఇందిర ,భవాని, గ్రామస్తులు వెంకట్ రెడ్డి, నరేష్,రాకేష్, వంశీ,గ్రామపంచాయతీ సిబ్బంది,ఉన్నారు.

## పిఇటిల క్రికెట్ లీగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ : జిల్లా ప్రైవేట్ వ్యాయా మ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న నిర్వహించే పిఇటిపిఎల్ సూపర్ సిక్స్ క్రికెట్ లీగ్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులకు అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అదేవిధంగా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుత కాలంలో క్రీడలకు ఆదరణ పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి పాఠశాలల్లో పిఈటి పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు, ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యా య సంఘం అధ్యక్ష కార్యదర్శులు బత్తిని శ్రీధర్ గౌడ్, దారం గౌతమ్‌రెడ్డి, కోశాధికారి కంకటి అనూప్ కుమార్, ముఖ్య సలహాదారు సిలివేరు మహేందర్‌తో పాటు మైపాల్, ముఫాజిల్, స్వామి, ప్రశాంత్, దుర్గరాజు, రవి, శివ, నరేందర్, జీవన్, అనూప్‌కుమార్, శ్రీధర్ గౌడ్, గౌతమ్‌రెడ్డి, రవికుమార్, మహ్మద్ రఫీ, షరీఫ్, శ్రీధర్, రాజు, అంజి, ప్రశాంత్, రాకేష్, మనీ, వినయ్, సుశీల్, మహేందర్, శ్రీనివాస్ నాయక్, రాజేష్ తదితరులున్నారు.

## ఎగ్జామ్‌థాన్ రన్‌లో పాల్గొన్న ఐవివై విద్యార్థులు




ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ : పరీక్షల ఒత్తిడిని దూరం చేస్తూ విద్యను ఆనందంగా స్వీకరించాలని ఉద్దేశ్యంతో రన్‌ఫర్ డ్రీమ్స్ .. నాట్ ఫర్ మార్క్స్ అనే నినాదంతో ఎగ్జామ్ థాన్ 2026ను ఆదివారం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో కావేరీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలో 3కె., 5కె, 10కె మూడు కేటగిరీలు ప్రవేశపెట్టారు. ఐవివై పాఠశాల వ్యవస్థాపకులు పసుల మహేష్, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారితో కలిసి పరుగులో పాల్గొనడంతో ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పసుల మహేష్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో పోటీతో పాటు స్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. పరీక్షలు కేవలం మార్కుల కోసమే కాదని, వారిలో భయం ఒత్తిడి తగ్గిస్తుందని, సహకారం, క్రీడాస్ఫూర్తి, పట్టుదల వంటి విలువలను పెంపొందిస్తుందన్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి టీషర్టు, మెడల్స్, రిఫ్రెష్మెంట్స్ అందించారు. 12 మంది విద్యార్థులు మొదటి స్థానంలో అద్భుతంగా రాణించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. 3కె రన్‌లో ఎస్.భవ్యశ్రీ పదివేల నగదు బహుమతి, వి.రినీష్ రూ.7500,ఎం.ఫణిందర్ తదితరులకు నగదు బహుమతులు అందించారు.

## బ్లూబెల్స్‌లో టెక్కి, రోబోటిక్స్, స్కిల్ దర్బార్ ప్రాజెక్టుల ప్రదర్శన




ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ : కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో గల బ్లూబెల్స్ పాఠశాలలో ఆదివారం యూలో టెక్కి, రోబోటిక్స్, స్కిల్ దర్బార్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. 6వ తరగతి నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా కోడి ంగ్, రోబోటిక్స్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు ప్రాక్టికల్స్ శిక్షణ అందిస్తున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో దాదాపు 350 మంది విద్యార్థులకు వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. రోబోటిక్స్ విభాగంలో రోప్ కార్, లైన్ ఫాలోవర్, అబ్జెక్ట్ డిటెక్షన్, సర్వో స్వీప్, మాన్యువల్ బూమ్ బారియర్, ఆటోమేటిక్ నైట్ లాంప్ వంటి ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కోడింగ్ విభాగంలో పైథాన్, హెచ్‌టిఎంఎల్, ఇంటర్నెట్ సేఫ్టీ, ఆటోమేటిక్ రెయిన్ షీల్డ్, క్యాలిక్యులేటర్, ఎర్త్ అరౌండ్ ది సన్, బర్త్‌డే కేక్, ఫ్లాగ్ బుక్ వంటి ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా క్వాలిటీ కో ఆర్డినేటర్ కె.అశోక్‌రెడ్డి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రీజనల్ మేనేజర్ ఫిరోజ్‌ఖాన్, యు లిప్స్ రీజినల్ హెడ్ సుప్రియా, కుడాలి శ్రీనివాస్, బి.సురేందర్ రెడ్డి, ప్రకాష్, పద్మజ, అలెగ్జాండర్, షోయబ్, విజయ్, సుప్రియలు హాజరయ్యారు. యూలో టెక్కి ప్రతినిధుల పాఠశాల ప్రిన్సిపల్ జంగా సునీత మనోహర్‌రెడ్డి దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, కోడింగ్ వంటి నైపుణ్యాలను విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు.

## జాతీయ హాకీ పోటీలకు హుజురాబాద్ స్టిక్ వారసులు

### రాంచీలో జరిగే టోర్నీకి నలుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాపక్షం/హుజురాబాద్ : హుజురాబాద్ గడ్డపై హాకీ స్టిక్ పట్టిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికై ప్రాంతం పేరు మారుమోగించారు. ఎంపికైన క్రీడాకారులు వీరే.. వనపర్తి జిల్లాలో ఇటీవల జనవరి 9,10,11 తేదీలలో జరిగిన 69 రాష్ట్ర స్థాయి పోటీల్లో నిమ్మటూరి లవణి ప్రియ (పదవతరగతి) ఏకశిలా పాఠశాల, ఈ రిషిక (9వ తరగతి, ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాల) సాదుల అభినయ్ ( 8వ తరగతి, వివేకవర్ధిని పాఠశాల), చరణ్ (9వ తరగతి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సైనిక్ పాఠశాల, కరీంనగర్) అద్భుత ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను హుజురాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్ర ప్రసాద్, క్లబ్ సెక్రటరీ తిరుపతి, జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యాక్షుడు బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ సెక్రటరీ గంగిశెట్టి ఉమామహేశ్వర్, సీనియర్ క్రీడాకారులు పిఈటి వేముల రవికుమార్, ఎండి. సజ్జు, బూసారపు శంకర్ అభినందించారు.

## జాతీయ ఓటర్ల దినోత్సవం




ప్రజాపక్షం/చొప్పదండి : మండల కేంద్రంలో ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిస్తుందని తహసీల్దార్ నవీన్ కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో మోహన్, సోషల్ వెల్ఫేర్ అధికారి సత్యం, నాయబ్ తహసీల్దార్లు కామ్రోద్దీన్, మన్మిత్‌సింగ్, ఆర్ఐలు త్రిపాల్ సింగ్, రహీం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుందనపల్లి సర్పంచ్‌కి సన్మానం



ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి సర్పంచి అర్కుటి కొమురయ్య యాదవ్‌ను ఆదివారం పెద్దపల్లిలో ఘనంగా సన్మానించారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలో నూతనంగా గెలుపొందిన ప్రజాప్రతినిధులను పెద్దపల్లిలో సన్మానించారు. సర్పంచి కొమురయ్యయాదవ్‌తోపాటు కుందనపల్లిలో గెలుపొందిన వార్డు సభ్యులు కన్నబోయిన ఏకాంబరం యాదవ్‌ను సన్మానించారు.

## జాతీయ ఓటరు దినోత్సవం



ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్మూర్ ఆదర్శ అంగన్వాడీ కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ పాఠశాల ఆవరణలో ముగ్గులు వేశారు. ఓటు హక్కును ప్రతిఒక్కరమూ వినియోగించుకుంటామని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని చెబుతూ గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పెండ్యాల విమల, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**ప్రజాపక్షం/ధర్మపురి :** 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మండల రెవెన్యూ అధికారి ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి కమలాపూర్ చౌరస్తా వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదిగా పేర్కొన్నారు. ప్రతీ ఓటరూ బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకోవాలని చెప్పారు.ముఖ్యంగా 18 ఏళ్ళు నిండిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థులచే మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ తిరుపతి, మండల గిర్ధవార్ భాస్కర్ రావు,సీనియర్ అసిస్టెంట్ అనిల్,గ్రామపాలన అధికారులు, బూత్ లెవల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## గ్రామంలో పైప్‌లైన్ లీకేజీలకు తక్షణ చర్యలు

**ప్రజాపక్షం/ముత్తారం:** ముత్తారం మండల కేంద్రంలోని గుర్రాల వాగు సమీపంలోనిమానేరు వాగులో ఉన్న మంచినీటి బోర్లను పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీ సమస్యను గ్రామ సర్పంచ్ సుధాటి రవీందర్ రావు స్వయంగా పరిశీలించారు. సమస్య తీవ్రతను గమనించిన వెంటనే సంబంధిత సిబ్బందితో మాట్లాడి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,గ్రామ ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యత అని అన్నారు.తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీటి వృథా జరుగుతుండటాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకున్నామని చెప్పారు.సర్పంచ్ ఆదేశాల మేరకు పైప్‌లైన్ మరమ్మతుల పనులను వెంటనే ప్రారంభించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సంబంధిత సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గర్రెపల్లి నరేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ అనుసరించిన మార్గం ఎప్పటికీ చిరస్మరణీయం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవ కార్యకర్త గంగాధర మధుసూదన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ నామ స్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌడ సంఘం అధ్యక్షులు గుండా గంగాధర్ పాల్గొని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు గుండా గంగాధర్ మాట్లాడుతూ అంబేద్కర్ అనుసరించిన మార్గం ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు .అంబేద్కర్ ప్రముఖ భారతీయ న్యాయవాది,ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత,సంఘ సంస్కర్త అని అంటరానితనం,కుల నిర్మూలన కోసం బిఆర్ అంబేద్కర్ ఎంతో కృషి చేశాడని అన్నారు.బాబాసాహెబ్ అంబేద్కర్ స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి అని అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు సమానత్వం న్యాయం సామాజిక సంస్కరణలో వారి ఆలోచనలు ఆశయాలను దేశంలోని బడుగు బలహీన వర్గాలు ప్రతి ఒక్కరు స్వేచ్ఛ వాయువులు హక్కులు పొందాలంటే అంబేద్కర్ త్యాగం కృషి మేధస్సు ఉందని కొనియాడారు .కావున దేశ ప్రజలందరూ అంబేద్కర్ సేవలను స్మరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు పల్లె నలగొండం,సాయిలు గౌడ్, మునిగళ్ళ శేఖర్, చెరుకు మల్లేష్,తిరుపతి, గంగాధర్,గుండ వెంకటేష్,నరేష్, మహేష్, దిలీప్ న్యాయవాది, సిరికొండ తిరుపతి, నక్క విజయ్, సామాజిక కార్యకర్త సాతల లక్ష్మణ్, జంగలి శ్రీనివాస్,జేరిపోతుల అంజయ్య, సామజిక సేవ కార్యకర్త గంగాధర మధుసూదన్, గ్రామస్థులు అంబేద్కర్ వాదులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీ -3, ఎపిఎ ఏరియాల ఉత్తమ ఉద్యోగులు

**ప్రజాపక్షం/రామగిరి :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేయడం జరిగిందని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రామగుండం3 ఏరియా నుండి ఉత్తమ అధికారిగా ఓ.సి1 లో ప్రాజెక్ట్ ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తున్న ఎ.ఉదయ భాస్కర్, (డిజియం, ఇ&ఎం), ఉత్తమ సింగరేణియన్ గా ఓ.సి 1 లో హెడ్ ఓవర్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న యం.సాంబయ్య, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా నుండి ఉత్తమ అధికారిగా డిప్యూటీ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న పెండ్యాల వేణు, ఉత్తమ సింగరేణియన్ గా ఎస్.డి.ఎల్. ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న బి.ఓదెలు, ఎంపికయ్యారని తెలిపారు. వీరిని కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో జరిగే ప్రధాన వేడుకల్లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చేతుల మీదుగా సన్మానిస్తారని తెలిపారు. అదే విధంగా రామగుండం 3 ఏరియా నుండి ఉత్తమ ఉద్యోగులుగా ఓ.సి1 లో హెడ్ ఓవర్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న మామిడి సాంబయ్య, ఇ.పి.హెల్పర్/గ్రీజర్ గా విధులు నిర్వహిస్తున్న నాయిని రవి, సి.హెచ్.పి.లో జనరల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న బి.రామచంద్రం, ఓ.సి 2 లో ఇ.పి.ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న షేక్ పాషా, ఫోర్ మెన్ (మెకానికల్) గా విధులు నిర్వహిస్తున్న బొల్లం శ్రీనివాస్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా నుండి ఫిట్టర్ గా విధులు నిర్వహిస్తున్న డి.రామమూర్తి, సీనియర్ మైనింగ్ సర్దార్ గా విధులు నిర్వహిస్తున్న యం.వెంకట సాయి, ఎంపికయ్యారని, వీరిని స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు నిర్వహించనున్న ఏరియా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానించడం జరుగుతుందని తెలిపారు.

## 'సింగరేణి' కుంభకోణాలపై విచారణ జరపాలి




**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని పట్టణంలోని టిబిజికెఎస్ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి ఆదివారం సన్మానించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జిగా నియామకమైన ఈశ్వర్‌ను హరి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్లుగా తుగ్లక్ పాలన కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడంలేదని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ నిరంకుశ పాలన సాగిస్తున్నారన్నారు. సింగరేణి సంస్థలో జరిగిన కుంభకోణాలపై సిబిఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని, తమ పార్టీ 40 స్థానాలను కైవసం చేసుకుంటుందని ఈశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బిఆర్ఎస్ నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, పిటి.స్వామి, మూల విజయారెడ్డి, గోపు అయిలయ్యయాదవ్, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 28న దేశవ్యాప్త ఆందోళనలు




**ప్రజాపక్షం/గోదావరిఖని :** మోడీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈనెల 28న దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళనలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ కోరారు. ఆదివారం గోదావరిఖని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం పేద ప్రజలు, రైతులు, కార్మికులపైన కక్ష సాధింపు చర్యలు చేపడ్తున్నదన్నారు. 44 లేబర్ కార్డులను తొలగించి 4 చట్టాలుగా తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ఉపాధి హామి పథకాన్ని పూర్తిగా రద్దు చేసే కుట్ర చేస్తున్నదన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో బూటక ఎన్‌కౌంటర్లు చేస్తూ అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నదన్నారు. ఈ సమావేశంలో టియుసీఐ రాష్ట్ర నాయకులు తోకల రమేష్, ఇసంపల్లి రాజేందర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి వెంకన్న, నాయకులు ఆడెపు శంకరన్న, గొల్లపల్లి చంద్రన్న, పుల్లూరి నాగభూషణం, కాల్వల రాయలు, నారయ్యలు పాల్గొన్నారు.

## వైభవంగా రథసప్తమి వేడుకలు

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం పట్టణంలోని రాముని గుండాల కొండపై శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో, బసంత్‌నగర్ సమీప శ్రీబుగ్గరామలింగేశ్వరాలయంలో రథసప్తమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొండపై వేద పండితులు నరేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి సుదర్శన హోమం, శ్రీవారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో సూర్యప్రభ వాహన ఊరేగింపు, పెరుమాళ్లకు చక్రస్నానం వంటి పూజాది కార్యక్రమాలు చేపట్టారు.బుగ్గ శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు సింగరేణి స్కౌట్ మాస్టర్స్, రోవర్స్‌లు ఉచిత సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటి ప్రధాన కార్యదర్శి మేడి తిరుపతి, సభ్యులు రవీందర్, శివప్రసాద్, గంగాధర్, సంజీవరెడ్డి, నరేష్, శ్రీనివాస్, సింగరేణి అధికారులు హనుమంతరావు, రమేష్‌లు పాల్గొన్నారు.

## విశిష్ట సేవలకు దక్కిన అరుదైన గౌరవం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి జిల్లా నర్సయ్య పల్లి వాసి సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్ నర్సయ్యపల్లి సర్పంచ్ గా ఎన్నికైన డా. జూపల్లి తిరుమల రావు కు ఆదివారం పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో ఆసియాన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ వారు తిరుమల రావు చేస్తున్న సామాజిక సేవలకు గాను నెల్సన్ మండేలా సేవా రత్న, హ్యూమానిటీరియన్ అవార్డును అందుకొని అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు.ఈ సందర్భంగా జూపల్లి తిరుమల రావు మాట్లాడుతూ తాను రాజకీయ రంగంలో,సామాజిక సేవా కార్యక్రమాల్లో అలాగే వ్యాపార రంగాల్లో చేసిన సేవలను, మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం అందేలా పని చేసినందుకు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు గుర్తించి నెల్సన్ మండేలా సేవా రత్న అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ పెద్దలకు, కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు ఇంతటి గొప్ప అవార్డు అందించిన యూనివర్సిటీ పెద్దలకు, యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమల్ రావుకు అవార్డు రావడం పట్ల గ్రామ ప్రజలకుపాటు రాజకీయ ప్రముఖులు తదితరులు అభినందనలు తెలిపి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## బోరుమోటరు వితరణ

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని వన్‌పల్లి గ్రామ రెడ్డి సంఘ భవనానికి మోటరు పంపుసెట్టును గ్రామ సర్పంచ్ తడగొండ సాయిలు అందజేశారు. ఎలక్షన్‌లో ఇచ్చిన మాట ప్రకారం సుమారు 40వేల విలువగల మోటారు సామాగ్రిని అందించి, రెడ్డి సంఘ సభ్యులతో కలిసి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. గ్రామాభివృద్ధి కోసం అన్ని సంఘాలు కలిసి కట్టుగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు నూనే నరసింహారెడ్డితో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## స్థల పరిశీలన

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** చత్రపతి శివాజి మహారాజ్ విగ్రహస్థాపన కోసం ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎనుగందుల నర్సింహులు ఆదివారం స్థలపరిశీలన చేశారు.ఆయన కొత్తబస్టాండ్ ప్రాంతంలో ఇతరాత్ర మూడు ప్రాంతాలలో అనువుగా ఉన్న స్థలాలను పరిశీలనకు వచ్చారు. ఆయన వెంట శివాజి యూత్ సభ్యులు,పాలకవర్గం ఉన్నారు. గ్రామస్థుల అభిప్రాయల సేకరణ చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంక్ తొలగించి అక్కడ విగ్రహాన్ని స్థాపించాలని కొందరు,లేదని రహదారి మధ్యగల సెంట్రల్ డివైడర్ మధ్యలో ఏర్పాటు చేయాలని మరికొందరు చర్చించుకున్నారు.పాలకవర్గం ఇరువురి సలహా తీసుకుని శివాజి విగ్రహస్థాపన కోసం త్వరలోనే నిర్ణయం తీసుకుని తీర్మాణం చేస్తామని సర్పంచ్ యూత్ సభ్యులకు హామి ఇచ్చారు.

## పోచమ్మ తల్లికి బోనాల సమర్పణ

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ గుండంపల్లి తో పాటు వివిధ గ్రామాల్లో పోచమ్మ తల్లికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించారు. ఆదివారం రోజున వేకువజామునుండే మహిళలు ప్రత్యేక నైవేద్యాలు వండుకొని ఆలయాలకు చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించి తమ పిల్లా పాపలు చల్లంగా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకుని మొక్కులను చెల్లించుకున్నారు. గుండంపల్లి గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ చీరలను కట్టుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో బస్సులో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** అనుమానస్పద స్థితిలో ఆర్టీసీ బస్సులో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బాన్సువాడ ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్22జడ్ 0050 నెంబర్ గల సూపర్ లగ్జరీ బస్సులో హైదరాబాద్‌లోని షాపూర్ స్టేజీ వద్ద బస్సు ఎక్కిన వ్యక్తి మహ్మద్‌నగర్ వరకు టికెట్ తీసుకుని ప్రయాణిస్తుండగా మహ్మద్‌నగర్ గ్రామ సమీపంలో బస్సు లోపల వెనుక భాగంలో స్పృహ కల్పోయి ప్రయాణికుడు రాజు పడిపోయి ఉండడగాన్ని గమనించిన తోటి ప్రయాణికులు అతన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికరి ఆంబులెన్స్‌లో తరలించారు. అప్పటికే రాజు మృతిచెందినట్లు వైధ్యులు తెలిపారు. మృతుని వయస్సు 12 సం.లు కాగా మృతునికి భార్య అనూష, ఒక కుమారుడు, కుమార్తె కలరు.

# ఓటే అభివృద్ధి ఆయుధం..

**ప్రజాపక్షం/ముధోల్:**ఓటే అభివృద్ధి ఆయుధమని కాంగ్రెస్ నాయకులు రావుల శ్రీనివాస్ సూచించారు.ఆదివారం మండలంలోని అష్టా గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు.ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని అందరూ కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు.గ్రామాభివృద్ధికి,ప్రజలు కోరే పాలన రావాలంటే ఓటే ఆయుధమని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువకులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్:**ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు వేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 2 కిలోమీటర్ల అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి పౌరుడి నైతిక బాధ్యత అని, ఓటింగ్ శాతం పెరిగినప్పుడే బలమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని, ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి డేవిడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి లోకేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 2789 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతంలో ఉన్న సింగూరు ప్రాజెక్టు నుండి 2789 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ప్రాజెక్టు అధికారులు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సింగూరు ప్రాజెక్టు నుండి 2789 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ఈ నీటిని ప్రధాన పంట కాలువ ద్వారా వ్యవసాయ అవసరాల కొరకు 1800 క్యూసెక్కులు వదిలిపెడుతున్నామనిఅధికారులు పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 1405.00 అడుగులు, 17.802 కాగా ప్రస్థుతం ప్రాజెక్టులో 1402.99 అడుగులు, 14.966 టీఎంసీల నీటి నిల్వతో కొనసాగుతుందని అధికారులు వెళ్ళడించారు.

# బలమైన ప్రజాస్వామ్యానికి ఓటే కీలకం



**ప్రజాపక్షం / పెంచికలపేట్:**ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు వేయాలని పెంచికలపేట్ సర్పంచ్ భక్తు రాంచందర్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 2 కిలోమీటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఓటు వేయడం ద్వారానే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇదే క్రమంలో వయోవృద్ధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ చిన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్, మండల నాయకులు మహేష్, కస్తూరిబా పాఠశాల సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**కేరమేరి:**దేశ భవిష్యత్తును నిర్ణయించే ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని కేరమేరి తహసీల్దార్ గోడం సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అర్హులైన వారందరూ ఓటు హక్కును కలిగి ఉండటంతో పాటు ఎన్నికల సమయంలో దానిని తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్, కంప్యూటర్ ఆపరేటర్ రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలతోనే ప్రాణ రక్షణ




**ప్రజాపక్షం/కాగజ్ నగర్:**వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి నితికా పంత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఆదివారం కాగజ్ నగర్ పట్టణంలోని పేపర్ మిల్లులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి నితికా పంత్ మాట్లాడుతూ దేశంలో గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో లక్షా ఏడు వేల మంది మరణించగా, తెలంగాణలోనే ఎనిమిది వేల మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, మైనర్ డ్రైవింగ్ వంటి నిర్లక్ష్యాలే మరణాలకు ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియా రీల్స్ కోసం బైకులపై సాహస కృత్యాలు చేసే వారిని ఉపేక్షించేది లేదని, అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని సూచించారు. రోడ్డు భద్రతా చట్టాలు ప్రస్తుతం కఠినంగా ఉన్నాయని, ప్రాణాలను పణంగా పెట్టి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని హితవు పలికారు. సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల మాట్లాడుతూ వ్యక్తిగత భద్రత పాటించడం వల్ల ప్రమాదాల నివారణ సులువవుతుందని, ఓవర్ లోడ్ వాహనాలకు దూరంగా ఉండాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి వాహిదుద్దీన్, ఎస్‌పిఎం ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ అమరేంద్ర కుమార్, జనరల్ మేనేజర్ గిరి, తహసీల్దార్ మధుకర్, ఏఎంవిఐ చంద్రశేఖర్, పురపాలక కమిషనర్ తిరుపతి, సిఐలు ప్రేమ్ కుమార్, కుమారస్వామి, ఎస్ఐ సుధాకర్, ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ చిత్రపటం పెట్టని వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:**గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటం పెట్టకుండా జెండా వందనం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అంబేద్కర్ చిత్రపటం లేకుండానే వేడుకలు జరుపుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని అందించిన మహనీయుని చిత్రపటం పెట్టకపోవడం బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించడమేనని వారు స్పష్టం చేశారు. ఈసారి వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటానికి అవమానం జరిగితే సహించేది లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకునే వరకు నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవరామ్ మాదిగ, అంబేద్కర్ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ మహల్కర్, బంజారా యువజన సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్, బిఎస్పీ నాయకులు శ్యామ్ రావు, దొండుజి దుర్గే, విజయ్ ఉప్రే, నాగ్ సేన్ ఉప్రే పాల్గొన్నారు.

# నిర్మల్‌లో ముగిసిన వన్యప్రాణుల గణన

## వాలంటీర్లకు ప్రశంసా పత్రాల అందజేత..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గత ఆరు రోజులుగా నిర్వహించిన అఖిల భారత పులుల గణన(ఎఐటిఈ2026) ఆదివారంతో విజయవంతంగా ముగిసింది.ఈ సందర్భంగా నిర్మల్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గణనలో పాల్గొన్న వాలంటీర్లకు డివిజనల్ అటవీ అధికారి(ఎఫ్.డి.ఓ)నాగిని భాను ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.జిల్లాలోని 102 బీట్లలో అటవీ శాఖ అధికారులు,సిబ్బందితో పాటు ఎన్జీవో సభ్యులు,వాలంటీర్లు ఈ గణనలో చురుగ్గా పాల్గొన్నారు.క్షేత్రస్థాయిలో శాఖాహార,మాంసాహార జంతువుల ఉనికిని పరిశీలించి,వాటి ప్రత్యక్ష,పరోక్ష ఆధారాలను సేకరించారు.ఈ సమాచారాన్ని ('MSTRIPES) మొబైల్ యాప్ లో నిక్షిప్తం చేసి,తదుపరి విశ్లేషణ కోసం హైదరాబాద్‌లోని జీఐఎస్‌సెల్ కు పంపినట్లు అధికారులు తెలిపారు.అక్కడి నుంచి రాష్ట్రవ్యాప్త గణాంకాలను నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్.టి.సి.ఎ) ఢిల్లీకి పంపనున్నారు.

# నేటి నుంచి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నేటి నుంచి స్వామి వారి జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ ఈవో వేణు తెలిపారు. నేటి నుంచి వచ్చే నెల 2 వరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. 26వ తేది నుంచి 28వ తేది వరకు అధ్యయన ఉత్సవం, ద్రవిడ ప్రబంధ పారాయణం నిర్వహించడం జరుగుతుందని, 29,30వ తేదిలలో శాల ప్రతిష్ట, వాస్తు హోమం, ధ్వజారోహణం, యజ్ఞం నిర్వహించడం జరుగుతుందని 31వ తేదిన ఉదయం యజ్ఞం, బలిహరణం, సాయంత్రం స్వామి వారి కళ్యాణ మహోత్సవం కలదని, బలిహరణం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 1వ తేదిన సాయంత్రం స్వామి వారి రథోత్సవం, అలాగే 2వ తేదిన చక్రతీర్థం(జాతర)తో పాటు సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా నలుమూలల నుంచి భక్తులు విచ్చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# మంచిర్యాల కార్పొరేషన్‌లో కాషాయ జెండా ఎగరేస్తాం




**ప్రజాపక్షం/మంచిర్యాల:**రాబోయే మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమిర్‌శెట్టి రాజ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మంచిర్యాల అభివృద్ధికి నోచుకోలేదని, పారిశుద్ధ్య లోపం, అధ్వాన్నపు రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ప్రజలు బిజెపికి బ్రహ్మరథం పడుతున్నారని, ఈసారి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వెరబెల్లి రఘునాథ్ సారథ్యంలో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి మంచిర్యాలను స్మార్ట్ సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలంటే బిజెపిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, గర్మిళ్ల జోన్ ప్రధాన కార్యదర్శి మెరడికొండ శ్రీనివాస్, తుల మధుసూదన్, కంకణాల సతీష్, కొత్తకొండ పోచం, గడికొప్పుల సుధాకర్ పాల్గొన్నారు.

# సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ..



**ప్రజాపక్షం/కుంటాల :**ఇటీవల నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ లో పథమ స్థానంలో నిలిచిన కుంటాల మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.వీరిని ఆదివారం ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ సన్మానించి అభినందించారు.సంగారెడ్డిలో ఇటీవల జరిగిన సైన్స్ ఫెయిర్‌లో సర్కిల్ తిరమ్స్‌న్ రియల్ లైఫ్ అప్లికేషన్ ప్రాజెక్టు గాను స్టేట్ లెవల్ లో ఫస్ట్ ప్రయిజ్,న్యాచురల్ ఫ్రిడ్జ్ ప్రాజెక్టుకి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఏత్రజ్ రాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు రమాదేవి,జునేరా అంజూమ్,టీచర్స్ పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం కల్పించిన ఆయుధం మన ఓటు..

**ప్రజాపక్షం/సారంగాపూర్:**ప్రజాస్వామ్యం కల్పించిన ఆయుధం లాంటిది మన ఓటు హక్కు అని తహసీల్దార్ సంధ్యారాణి అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో ప్రభుత్వాఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిం డిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు కలిగి ఉండాలని, నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని పలు సూచనలు చేసి ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపతాహసిల్దార్ రవీందర్, ఆర్.ఐ నరసయ్య,గ్రామ సర్పంచ్ భూమన్న, అధికారులు నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అవగాహన..మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా బ్యాలెట్ బాక్స్ లను ఏర్పాటు చేసి,విద్యార్థుల వేలికి సిరారంగు అంటించి తమ నాయకున్ని ఎన్నుకోవాలో ప్రదర్శించి చూపించారు.కరస్పాండెంట్ సముద్రాల గీత,ప్రధానోపాధ్యాయులు విమల,అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఎడపల్లి:**ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని ఎడపల్లి ఎమ్మార్వో దత్తాత్రి అన్నారు. ప్రభుత్వాలు, పాలకులను మార్పు చేసే శక్తి ఓటుకుంది. అటువంటి విలువైన ఓటును వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హై స్కూల్ తో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో సర్పంచి పరిగె సాయిలు, హన్మంత్ రెడ్డి, ఆర్ఐ రవి కుమార్, రఘు, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు, యువతీ యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




**దిలావర్‌పూర్:**మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వరణలో జాతీయ ఓటర్ దినోత్సవం ను ఘనంగా జరిపారు.ఈ కార్యక్రమానికి దిలావర్‌పూర్ సర్పంచ్ అక్షర అనిల్ కుమార్,ఉప సర్పంచ్ సుఖేష్ ఓటర్ దినోత్సవం కార్యక్రమం పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అజీజ్ అమ్మద్ ఖాన్ మాట్లాడుతూ ఓటు కలిగిన ప్రతి భారతీయ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికలలో అభ్యర్థులు ఇచ్చి తాయిలాలను తీసుకోకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని అలాగే తొలిసారిగా ఓటు వచ్చిన యువతి,యువకులు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్ ఐడి కార్డులను పంపిణీ చేయడం జరిగింది.అలాగే క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న మహిళకు శాలువతో అధికారులు,ప్రజా ప్రతినిధులు సన్మానించడం జరిగింది.ప్రజలు అధికారుల చేత తాసిల్దార్ ఓటర్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్,అధికారులు,ప్రజా ప్రతినిధులు,ప్రజలు పాల్గొన్నారు.

**లోకేశ్వరం:**లోకేశ్వరం మండలంలోని మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో జాతీయ ఓటర్ దినోత్సవం జరుపుకున్నారు.రాజు ర లోని గ్రామపంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ శ్యామల ముత్త గౌడ్ గ్రామపంచాయతీ సిబ్బంది,అంగన్వాడీ సిబ్బందితో జాతీయ ఓటర్ దినోత్సవం జరుపుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం అవుదామని ఓటు హక్కును వినియోగించుకుంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నట్లే అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిపిఓ శ్రీధర్,ఉపసర్పంచ్ సురేష్ వార్డు సభ్యులు నాయకులు ఉమెన్ రైట్స్ చైర్మన్ సరస్వతి అనిల్ ఆశ వర్కర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ ఇచ్చే కౌంటర్ పొడవుగా ప్రసాదం ఇచ్చే కౌంటర్ చిన్నది

**ప్రజాపక్షం/ముధోల్(బాసర):**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.ఎంతో అభివృద్ధి చెందాల్సిన ప్రసిద్ధ ఆలయంలో నేటికి అరకొర వసతులు ఉండడంతో భక్తులకు పరిస్థితులు ప్రతికూలంగా మారాయి.ఇలా ఆలయంలోని ప్రతి ప్రదేశం వద్ద ఏదో ఒక అసౌకర్య పరిస్థితులు నెలకొన్నాయి.ప్రత్యేకంగా ప్రసాదం కొరకు ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్ 6 లైన్లతో పొడవుగా ఉండి ప్రసాదం తీసుకునే కౌంటర్ మాత్రం చిన్నదిగా ఉండడం దీంట్లో ప్రత్యేక లైన్లు లేకపోవడం మహిళలు,పురుషులు ఒకే లైన్‌లో గుంపులుగా వెళ్లి ప్రసాదం తీసుకోవడం జరుగుతోంది.ఇలా సమస్యలున్న ప్రతి ప్రదేశాన్ని గుర్తించి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి సిఎం సహాయ నిధి

**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్ అనే వ్యక్తి కిడ్నీ సమస్యతో అనారోగం బారిన పడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందారు. పేదరికంలో ఉన్న ఫయాజ్ కుటుంబం లక్షల రూపాయల మొత్తాన్ని భరించలేక నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, బిల్లా రామ్మోహన్, నెహ్రూనగర్, మాజీ సర్పంచి అమానుల్లా షరీఫ్‌తో పాటు ఖాజా బేగ్ లు బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన సుదర్శన్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఫయాజ్ చికిత్స నిమిత్తం మూడు లక్షల రూపాయాలు మంజూరు చేయించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈఎల్ఓసీ కాఫీని ఎడపల్లి ఫయాజ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఉదారతకు, పులి శ్రీనివాస్ రావు, బిల్లా రామ్మోహన్ ల చొరవకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల అధ్యక్షుడిగా జితేందర్ ఎన్నిక

**ప్రజాక్షం/భీమ్‌గల్ :**ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల కార్యవర్గ ఎన్నికను ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించామన్నారు. ఇందులో అధ్యక్షునిగా కూనే జితేందర్, ఉపాధ్యక్షులుగా గంగారపు గంగాధర్, మంజుల కార్యదర్శిగా కునే రమేష్, సంయుక్త కార్యదర్శిగా మగ్గిడి రాజేందర్, కోశాధికారిగా కునే దీన, వెంకటేష్, గౌరవ అధ్యక్షులుగా సొప్పరి యాదగిరి, హన్మాండ్లు, సలహాదారులుగా రహమాన్, ధర్మపురి నానాజీ, రేగుల గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జితేందర్ మాట్లాడుతూ నాపై నమ్మకం విశ్వాసముంచి నన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్న ప్రతిఒక్క ఆర్ఎంపి, పిఎంపి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు పాల్గొన్నారు.

## తారు రోడ్డు పోసేదెప్పుడు? ప్రమాదాలు ఆగేదెలా?

**ప్రజాపక్షం / నందిపేట్:** నందిపేట్ మండల కేంద్రంలో గత ఆరు నెలల క్రితం ప్రధాన రోడ్డు తారు రోడ్డుగా వేయడానికి తవ్వి వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు జరగవలసి ఉంది. కానీ గ్రామ రాజకీయాల వలన పనులు ఆగిపోయాయి. అందుకే తారులేక ప్రమాదాలు ఆగవు. గత ప్రభుత్వం రోడ్డు విస్తరణలో భాగంగా నందిపేట్‌లోని వివేకానంద విగ్రహం నుంఇ మజీద్ వరకు డివైడర్‌లు నిర్మించి రెండు వైపులా రోడ్డు విస్తరణ చేసేందుకు, మురికి కాలువలు నిర్మిండానికి రూ. 12 కోట్లు అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మంజూరు చేయించారు. శాసన సభ ఎన్నికలకు ముందు పనులు ప్రారంభించి చురుకుగా సాగాయి. నంది విగ్రహం నుంచి మజీద్ వరకు పనులు ఆగిపోయాయి. ఇరు వైపులా ఉన్న దుకాణాలు తొలగించాలని ఆర్అండ్‌బి అధికారులు గ్రామ కార్యదర్శికి రాతపూర్వకంగా ఇచ్చినా పలితం లేదు. ఈ విషయంలో మండల రెవెన్యూ అధికారికి ఆదేశాలున్నా శాంతియుతంగా స్తానికులతో చర్చించి దుకాణాలు తొలగిస్తామని చెబుతున్నారు. ఇలా దాదాపు నాలుగైదు నెలలు కావస్తుంది. రోడ్డు తవ్వడం వల్ల కంకర తేలి ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు గాయాల పాలై ఈ మధ్యే ఒకరు మృతిచెందారు. మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. ఈ విషయంలో గ్రామాభివృద్ధి కమిటి కల్పించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## బతుకమ్మ చీరలతో బోనాలు..

**ప్రజాపక్షం/సారంగాపూర్:**మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శ్రీమహా పోచమ్మ,మహాలక్ష్మి ,ముత్యాలమ్మ తదితర ఆలయాల్లో చలి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయం మండలంలోని పరిసర గ్రామాల మహిళలతో ఆదివారం సందడిగా మారింది.శ్రీ మహా పోచమ్మ కు మహా ప్రసాదంగా భావించే పాయాసంతో బోనాలు సమర్పించారు.మండలంలోని వైకుంఠాపూర్ గ్రామంలో మహిళలు నినూత్నంగా ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరలతో శ్రీ మహాలక్ష్మి కి బోనాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు.

## మల్లెపూల నరేంద్రను ఈ సమాజం ఎప్పటికీ మరువదు :తాహెర్



**ప్రజాక్షం/నిజామాబాద్:**విధి నిర్వహణలో ప్రాణాలు కోలోపయిన జర్నలిస్ట్ మల్లెపూల నరేం ద్రను ఈ సమాజం ఎప్పటికి మరువదని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. జర్నలిస్ట్ మల్లెపూల నరేంద్ర మెమోరియల్ స్పోర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో మల్లెపూల నరేంద్ర 36వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పాటిలెక్నిక్ మైదానంలో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను మహిళ ఎడ్యుకేషన్ కళాశాల ప్రెసిడెంట్, బార్ సభ్యుడు రాజేందర్‌రెడ్డితో ప్రారంభించారు. గెలుపొంటిన వారికి బహుమతులు అందజేసి ఓటమి పాలైన వారు అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, నర్సయ్య, సుబాష్, రాజ్‌కుమార్, రాజు, సంజీవ్, నర్సయ్య, సుధాకర్, జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు..!ఆపే నాథుడే లేడా..?

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:**నిర్మల్ పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది.ఒకవైపు విద్యుత్ పొదుపు చేయాలని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ,క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.పట్టణంలోని శాస్త్రి నగర్ దక్షిణ భాగం,యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న పక్క వీధిలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి.



**విద్యుత్ వృధాపై కాలనీవాసుల ఆందోళన..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తున్న నేపథ్యంలో,దానిని సద్వినియోగం చేసుకోవాల్సింది పోయి ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడంపై కాలనీవాసులు మండిపడుతున్నారు.సూర్యుడు నడి నెత్తిన ఉన్నా వీధి దీపాలు వెలుగుతుండటంతో ప్రభుత్వ ధనం వృధా అవుతోందని వారు వాపోతున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి,సమయానుకూలంగా వీధి దీపాలను ఆపివేసేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కుప్పలుగా పేరుకుపోయిన చెత్త..వారానికోసారి వస్తున్న **చెత్త బండి..!**

కేవలం విద్యుత్ సమస్యే కాకుండా,శాస్త్రి నగర్ కాలనీలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది.కాలనీలో చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోతోంది.మున్సిపల్ చెత్త సేకరణ వాహనం ప్రతిరోజు రాకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వారానికి ఒకేసారిఃరోజూ రావాల్సిన చెత్త బండి వారం,పదిరోజులకు ఒకసారి వస్తోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.ఇంట్లో చెత్తను నిల్వ ఉంచలేక,గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రజలు చెత్తను రోడ్లపై వేయాల్సి వస్తోంది.దీనివల్ల కాలనీ అంతా అపరిశుభ్రంగా మారి,దుర్వాసన వెదజల్లుతోంది.అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని,మున్సిపల్ యంత్రాంగం ఇకనైనా మొద్దు నిద్ర వీడి పారిశుధ్య పనులు మెరుగుపరచాలని,కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.రోజువారీగా చెత్తను సేకరించి,అంటువ్యాధులు ప్రజలకుండా చూడాలని వారు కోరుతున్నారు.

## ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణకు గ్రామాల్లో తీర్మానం చేయాలి

**ప్రజాపక్షం/జైనూర్ :**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు చేయాలని కొమురం భీం ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పిలుపునిచ్చారు. ఎఐసిసి, టిపిసిసి ఆదేశాల మేరకు ఆదివారం జైనూర్, కేరమేరి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జైనూర్ మండల కేంద్రంతో పాటు జంగాం, కేరమేరి మ డలం గోయెగావ్ గ్రామాలను సందర్శించి సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలను కలిసి తీర్మానం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రాజకీయాలకు అతీతమైందని, ఇది గ్రామీణ ప్రజల ఉపాధి, అభివృద్ధికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేసిన అనంతరం సర్పంచ్



సంతకం, ముద్రతో కూడిన ప్రతిని జిల్లా డిసిసి కార్యాలయానికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రాథోడ్ రమేష్, జైనూర్ మండల అధ్యక్షుడు ముఖిద్, జంగాం సర్పంచ్ పేందూర్ అనసూయ, అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజాద్, గోయెగావ్ సర్పంచ్ ఆత్రం ఆనంద్ రావు, నాయకులు సుదర్శన్, భగవంత్ రావు, రహీం, అజ్జులాల, అబ్దుల్, ఇర్ఫాన్, సిద్దేశ్వర్, జైరామ్, ప్రకాష్, రఫీఖ్, తిరుపతి, గణేష్, బుచన్న, దిలీప్, జీవన్ పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని మంగ్లూరు గ్రామానికి చెందిన గైని శ్యామయ్య(44) శనివారం మధ్యాహ్నం తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని చనిపోయినట్లు స్థానిక ఎస్సై శివకుమార్ తెలిపారు. తన తండ్రి ఇల్లు కట్టడం, ట్రాక్టర్ కొనడం వలన అప్పులు ఎక్కువయ్యాయన్న తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కొడుకు దుర్గాప్రసాద్ పేర్కొన్నాడు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు.

## ఊరి దేవతలకు చలి బోనాలు..



**ప్రజాపక్షం/కుంటాల :** కుంటాల మండల కేంద్రంలో ఆదివారం గ్రామ దేవతలకు చలి బోనాలు సమర్పించారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో భక్తులు ఉదయం నుండే బోనాలతో క్యూ కట్టారు. మహిళలు గ్రామ దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం ప్రతిఒక్కరం ఓటేద్దాం




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రజాస్వామ్యంలో రాగద్వేషాలకు అతీతంగా ప్రతి ఒక్కరం ఓటు వేయిద్దామని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం ఉదయం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భగా ఎన్‌టిఆర్ చౌరస్తా వద్ద ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ప్రతి ఒక్కరం ఓటు వేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్, వివిధ శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌కు సన్మానం



**ప్రజాక్షం/ఆర్మూర్ :** మండలంలోని పల్లె(హరిపూర్) గ్రామానికి ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో నూతన సర్పంచ్‌గా గెలుపొందిన పార్దేమ్ మనీషా సంజీవ్‌కు ఆమె స్వగృహంలో ఆదివారం ప్రభుత్వ ఉపాధ్యాయులు లింబాద్రి స్వామి మిత్ర బృందంతో కలిసి అభినందిస్తూ సన్మానించి జ్ఞాపికను అందజేశామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన గ్రామపంచాయతీ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్క రంజిత్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంసన్, రాం అశోక్, గంజి మనోహర్, కపిల్‌గౌడ్, రాగం నరేష్ పాల్గొన్నారు.

## యాదవుల ఐక్యతకు నిదర్శనం-నిర్మల్ సన్మాన సభ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన యాదవ్ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు దాదాపు 50 మందిని యాదవ్ సంఘం నిర్మల్ పట్టణం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యాదవ్ సమాజ ఐక్యతకు అద్దం పట్టే విధంగా అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ఎన్నికై ప్రజాసేవకు అంకితమైన నాయకులు మాట్లాడుతూ..యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ విధమైన కార్యక్రమం జరగడం గర్వకారణమని, నిర్మల్ నియోజకవర్గంలోని యాదవులంత ఒకే తాటిపై నిలబడి రాజకీయంగా, సామాజికంగా మరింత బలంగా ఎదగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో యాదవులు ముందుండాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు, కార్యదర్శులు, జంపెల్లి.శ్రీనివాస్ యాదవ్, మంచాల ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ యాదవ్ సమాజ అభివృద్ధి, యువత నాయకత్వ వికాసం, సామాజ ఐక్యత లక్ష్యంగా గతంలోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో మరింత పెద్ద స్థాయిలో కార్యక్రమాలు చేపడతామని ధృఢ సంకల్పం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ధని,సారంగాపూర్, డ్యాంగాపూర్, మాదాపూర్, కొండాపూర్, లోలం, బస్సెల్లి, ఆరేపల్లి, పరిమండల్, కూచనపల్లి తదితర గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. అలాగే పట్టణ యాదవ్ సంఘ నాయకులు,నరహరి యాదవ్, అంబటి.మహేందర్ యాదవ్,బైకస్,చిన్నయ్య యాదవ్, పిండి శ్రీనివాస్ యాదవ్,జంగిలి.బాలాజీ యాదవ్,అనంతుల. లక్ష్మ ణ్ యాదవ్, మంచాల పెద్ద నరసయ్య యాదవ్, మంచాల పెద్ద చిన్నయ్య, పిండి. మల్లేష్ యాదవ్,గిట్టవోయిన చిన్న అశోక్,సూర సుధాకర్, మంచాల శ్రీనివాస్ నగేష్ యాదవ్ తోపాటు యాదవ్ సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.యాదవ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ పతి,భూమన్న యాదవ్, గంగాధర్, మంచాల. నర్సయ్య, ఎర్రోళ్ల మురళి, గణేష్,తదితర ప్రముఖులు ఈ సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిరసన దీక్ష

### ఉద్యమ కారుల ఆకాంక్షలు నెరవేరిస్తేనే ప్రజాస్వామ్య తెలంగాణ




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల సాధనకై ఈరోజు నిర్మల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమ ఫోరమ్ (టి.యు.ఎఫ్)ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు పాల్గొని శాంతియుతంగా తమ డిమాండ్ల సాధనకై దీక్ష చేపట్టడం జరిగింది.ముఖ్య అతిథిగా రాష్ట్ర తెలంగాణ ఉద్యమ ఫోరం టి.యు.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ హాజరయ్యారు. మరొక విశిష్ట అతిథిగా మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరై దీక్ష చేపట్టిన ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలము, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు, ఉద్యమకారుల స్వాంతంత్ర సమరయోధులుగా గుర్తించి 25వేల రూపాయల పెన్షన్,ఉద్యమకారుల గుర్తింపు కార్డులను ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగుతూనే ఉందని, ఉద్యమకారుల ఐక్యతతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. మరో విశిష్టతగా హాజరైన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుల డిమాండ్ల సహేతుకమైనవి అని, ఆ రోజుల్లో తెలంగాణ అంశం లేవనెత్తినందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్,రాష్ట్రంలో తన మంత్రి పదవిని సైతం త్యాగం చేశానని,మలిదశ ఉద్యమంలో ఆమరణ నిరాహార దీక్ష సైతం చేపట్టడం జరిగిందని తెలిపారు.ఉద్యమకారుల డిమాండు ముఖ్యమంత్రి వద్దకు ప్రస్తావించి డిమాండ్ల సాధనకై తన వంతు కృషి తప్పక చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలోఉమ్మడి ఆదిలాబాద్ టి.యు.ఎఫ్ చైర్మన్ కొట్టే శేఖర్,నిర్మల్ జిల్లా టి.యు.ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు,సీనియర్ ఉద్యమ నాయకులు ఎంసి లింగన్న, సామ కిరణ్ రెడ్డి, షరీఫ్, రాష్ట్ర నాయకులు శ్రీమతి జ్యోతి, లావణ్య, పాకాల రామచందర్, తెలంగాణ షరీఫ్, యు.రామకృష్ణ, డా.మురళీధర్, పుండలీక్ రావు, గంగన్న, జగన్, వీరయ్య, వినోద్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం కల్పించిన శక్తివంతమైన ఆయుధం ఓటు

**ప్రజాపక్షం / బెల్లంపల్లి, నస్పూర్ :** దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు తమ పేరు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన 16వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 1950 జనవరి 25వ తేదీన నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం స్థాపించబడిందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగిన మన దేశంలో వేలిపై పడే సిరా చుక్క ద్వారానే ప్రభుత్వాలు మారుతాయని పేర్కొన్నారు. యువ ఓటర్లు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఖచ్చితంగా ఓటు వేసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం 'నా భారతదేశం నా ఓటు' అనే నినాదంతో అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉత్తమ బూత్ స్థాయి అధికారులు, స్వీప్ నోడల్ ఆఫీసర్, కళాజాత బృందం, లక్షెట్టిపేట, హాజీపూర్ తహసీల్దార్లతో పాటు సీనియర్ సిటిజన్లను శాలువాలతో సత్కరించి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు కిషన్, వెంకటేశ్వరరావు, యాదయ్య, శంకర్, ప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కబడ్డీ రిఫరీగా నిర్మల్ వాసి..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా క్రీడా రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. జిల్లాకు చెందిన సుంకా ప్రేమలత సీనియర్ మహిళల జాతీయ స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్‌కు జాతీయ రిఫరీగా ఎంపికయ్యారు. పట్టుదలతో శ్రమించి క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రేమలత, జాతీయ స్థాయి పోటీలలో రిఫరీగా వ్యవహరించే అవకాశం దక్కించుకోవడం విశే షం. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న, డివైఎస్‌వొ శ్రీకాంత్ రెడ్డి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.భూపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సునీల్ మాట్లాడుతూ,ప్రేమలత ప్రతిభ ఇతర క్రీడాకారులకు మార్గదర్శకంగా నిలుస్తుందని,ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ గుర్తింపు పట్ల జిల్లాలోని క్రీడాకారులు,వ్యాయామ ఉపాధ్యాయులు,పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు చేయూత..

### 93 మంది లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బైంసా :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు తమ వంతుగా చేయూతను అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. ఆదివారం బైంసా లోని ఎస్.ఎస్.జిన్నింగ్ ఇండస్ట్రీలో నియోజకవర్గానికి చెందిన 93 మంది లబ్ధిదారులకు 23 లక్షల 74 వేల రూపాయలను చెక్కుల రూపంలో ఆయన అందించిన సందర్భంగా మాట్లాడారు.అనారోగ్యం బారిన పడిన పేదలకు సి.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా ఆదుకునేందుకు తన నివాసం లోనే ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రాజకీయ లకు అతీతంగా సహాయ నిధి చెక్కులను అందించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో బీజేపీ పట్టణ మండలాల అధ్యక్షుడు రావుల రాము సిరం సుష్మ రెడ్డి యేశాల దత్త్రాత్రి,నాయకులు మల్లేష్ తో పాటు పలువురు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రెండు సంవత్సరాల్లో రెండు వేలకు పైగా చెక్కులను అందించడం జరిగిందన్నారు.ఎమ్మెల్యే పటేల్ చేస్తున్న అభివృద్ధి వల్లే సర్పంచ్ ఎన్నికల్లో 103 సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకొని చరిత్ర తిరగ రాయడం జరిగిందన్నారు.కార్యక్రమం లో మాజీ ఎం.పి.పి రజాక్ తో పాటు సీనియర్ నాయకులు పొలంకి భీంరావు,రావుల పోశెట్టి, గౌతం పింగ్లే,సర్పంచ్‌లు, బిజెపి పార్టీ బాధ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యువత దేశానికి వెన్నుముక



**ప్రజాపక్షం/ఎడపల్లి :** బారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు యువతను సంఘటితం చేయడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గత వందేళ్లుగా నిరంతరం కృషి చేస్తుందని ఇందూర్ జిల్లా ఉపాధ్యాయ ప్రముఖ్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల మలిభట్ట శ్రీపాద్ పాల్గొన్నారు. ఆదివారం ఎడపల్లి ఖండ పరిధిలో నిర్వహించిన యువ సాంఘిక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, వారిని సన్మార్గంలో నడిపించి దేశ సేవలో భాగస్వాములను చేసేందుకు ఆర్ఎస్ఎస్ నిరంతరం ముందుంటుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో యువత కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు క్రమశిక్షణ, దేశ భక్తి కలిగిన యువత ద్వారానే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ఈ యువ సాంఘిక్ సమ్మేళనానికి యువత నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వయం సేవకులు గుండి పరశురాం, ఆకుల నీలకంటరావు, కమల ప్రవీణ్ కుమార్, దుబాస గంగ ప్రసాద్, నాగరాజు కటకం అరుణ్ కుమార్, మోస్రా సాయి కుమార్, తోటి స్వయం సేవకులు పాల్గొన్నారు.

## వెల్మల్‌లో ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేయాలి...

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక సహకార సంఘం ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని అకిలపక్షం నాయకులు వివరించారు. ఈ సంఘ సరిహద్దు గ్రామాలైన ఆంధ్రానగర్, కౌల్‌పూర్, రైతుఫారం, జోజిపేట్ గ్రామాలున్నాయని, సుమారు నాలుగు వేల ఎకరాలు ఉంటుందన్నారు. అయిలాపూర్ నుంచి వేరు చేసి వెల్మల్ కొత్త సహకార సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్, ఉపసర్పంచ్ మహేశ్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు.